బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మరింత పెరగనున్న ఎండల తీవ్రత



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మూడు రోజులపాటు ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఈమేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సాధారణం కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని పేర్కొంది. ఖమ్మం, భద్రాచలంతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ లాంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. మెదక్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా సోమవారం రాష్ట్రంలో అత్యధికంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని చెప్పారు. రానున్న మూడు రోజుల పాటు తూర్పు, ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

## క్రిమినల్ కేసులుంటే ఉద్యోగాలకే అనర్హులు!

### మరి ప్రజాప్రతినిధులుగా ఎన్నిక ఎలా ?



- సుప్రీంకోర్టు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

'క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరడానికే అనర్హులు, అలాంటిది ప్రజాప్రతినిధులుగా ఎలా అర్హులవుతారు ?' అని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టిన సందర్భంగా పై వ్యాఖ్యలు చేసింది. ఒకసారి దోషులుగా తేలిన తర్వాత, మళ్ళీ వారు పార్లమెంట్‌కు, శాసనసభలకు ఎలా తిరిగివస్తారు ? ఇందులో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు వున్నట్లు కనిపిస్తోందని జస్టిస్ దీపంకర్ దత్తా వ్యాఖ్యానించారు. ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయని, కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏండ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవని తెలిపారు. నిందితులు ఏండ్ల తరబడి విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం ఈ జాప్యానికి మరో కారణమని నివేదికలో పేర్కొన్నారు. నేరస్తులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నకునే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని సూచించింది. సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 4వ తేదీకి వాయిదా వేసింది.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త



- ఉచితంగా ఇసుక..
- సామాన్యులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలి
- ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలి
- హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యతను హైడ్రాదే
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో ఇసుక రవాణా, తవ్వకాల అంశంపై ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు.

ఇక ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యతను హైడ్రాకు అప్పగించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. ఆ విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని చెబుతూ అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని చెప్పారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలని, విధి నిర్వహణలో పర్మనెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలంటూ ఈ సందర్భంగా ముఖ్య మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుకను అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి. అందుకు జిల్లాల వారిగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలి. అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలి. ప్రతి రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలి.

రవాణాకు సంబంధించి

రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేయాలి. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలి. ప్రాంతాల వారిగా సమీప రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా వ్యవస్థ ఏర్పడాలి. సమస్య తలెత్తినప్పుడు వెంటనే పరిష్కారం జరగాలి. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలి. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించిన సీఎం. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకో వాలి. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో పలు మార్పులు జరగాలి. ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలి అని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ గారు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## త్వరగా జనగణన చేపట్టాలి



- కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్రం వీలైనంత త్వరగా జనగణన చేపట్టాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ డిమాండ్ చేశారు. 140 కోట్ల మందికి తాము జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చామని.. జనగణన లేకపోవడంతో 14 కోట్ల మంది దీని ప్రయోజనాలు కోల్పోతున్నారన్నారు.

రాజ్యసభలో సోమవారం ఆమె మాట్లాడుతూ దేశంలో 140 కోట్ల మందికి తాము జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చామని.. జనగణన లేకపోవడం వల్ల 14 కోట్ల మంది ప్రజలు దీని ప్రయోజనాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కలనే ఇప్పటికీ పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఇలా జరుగుతోందని ఆరోపించారు. "2013 సెప్టెంబర్‌లో తాము రూపొందించిన NFSA చట్టం 140 కోట్ల జనాభకు పోషకాహార భద్రత అందించడంలో మైలురాయిగా మారింది. కరోనా సమయంలో ఈ చట్టం వల్ల లక్షలాది కుటుంబాలకు కడుపు నింపింది. త్వరగా జనగణన చేస్తే NFSA కింద ఎంతోమంది ప్రజలు లబ్ది పొందుతారు. ఎన్డీయే పాలనలో జనాభా గణన నాలుగేళ్లకు పైగా ఆలస్యమయ్యింది. 2021లోనే జనగణన నిర్వహించాల్సి ఉండగా.. కేంద్రం దాన్ని విస్మరించింది. మళ్లీ ఎప్పుడు చేపడతారనేదానిపై స్పష్టత లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ ఆహార భద్రతా చట్టం వల్ల దాదాపు 81.85 కోట్ల మంది లబ్ది పొందారు. గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం ప్రజలు దీనివల్ల ప్రయోజనం పొందారు. ఈ స్కీమ్ ద్వారా ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల ఆహార ధాన్యాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని" సోనియా గాంధీ అన్నారు.

స్వతంత్ర భారత దేశ చరిత్రలో మొదటిసారి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనగణన నాలుగేళ్లు ఆలస్యం అయ్యిందని సోనియా గాంధీ తెలిపారు. "బడ్జెట్ కేటాయింపులు చూస్తే ఈ ఏడాది కూడా జనగణన జరగదని అర్థమవుతోంది. జనగణన జరగకపోవడం వల్ల 14 కోట్ల మంది అర్హతగల భారతీయులు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద వారికి లభించాల్సిన ప్రయోజనాలను కోల్పోతున్నారు. జనగణనను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. అర్హులైన వారందరికీ జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ప్రయోజనాలు అందేలా చూడాలి. ఆహార భద్రత ఒక ప్రత్యేక హక్కు కాదు. ఇది ప్రాథమిక హక్కు" అని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు.

## రైతు భరోసా నిధులు విడుదల



**రూ.2,223.46 కోట్ల నిధులు విడుదల**

**34,75, 994 మంది రైతుల అకౌంట్లలో నిధుల జమ**

**బలగం టీవి, హైదరాబాద్**

రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రెండు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదల చేసింది. ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున 17 లక్షల మందికి రూ.2,223.46 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో కలిపి ఇప్పటి వరకు మొత్తం 37 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. 34,75, 994 మంది రైతుల అకౌంట్లలో నిధుల జమ చేసింది. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

జనవరి 26వ తేదీన రైతు భరోసా పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. మొదటి దశలో పథకం ప్రారంభించిన గ్రామాల్లోని రైతులకు మాత్రమే పెట్టుబడి సాయాన్ని అకౌంట్లలో జమ చేసిన ప్రభుత్వం.. ఎకరం సాగు భూమి ఉన్న రైతులకు, రెండెకరాలు ఉన్న రైతులకు అంటూ విడతలవారీగా నగదు జమ చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా.. తొలి విడతలో జనవరి 27న 563 గ్రామాల్లోని 4,41,911 రైతులకు సంబంధించి 9,48,332.35 ఎకరాలకు పెట్టుబడి సాయం కింద రూ.5,68,99,97,265 నిధులు విడుదల చేయగా.. ఫిబ్రవరి 5వ తేదీన 17,03,419 రైతులకు చెందిన 9,29,234.20 ఎకరాలకు రూ.5,57,54,07,019 నిధులు విడుదల చేశారు. అయితే..ఫిబ్రవరి 10న 8,65,999 మంది రైతులకు చెందిన 11,79,247.17 ఎకరాలకు గానూ రూ.7,07,54,84,664 జమ చేసినట్లు రేవంత్ రెడ్డి సర్కార్ పేర్కొంది. ఇప్పటివరకు మొత్తంగా 30,11,329 రైతులకు చెందిన 30,56,814.32 ఎకరాలకు రూ.1834,08,88,948 పెట్టుబడి సాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొంది.

ఈ సందర్భందా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు రైతులు ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించారని ఆరోపించారు. పదేళ్ల పాటు టైమ్ పాస్ చేసి.. ఇప్పుడు సిగ్గులేకుండా కేటీఆర్ మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని మంచి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే చేసిందన్నారు. రైతులు లబ్ధిపొందకుండా కేటీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రైతుల వద్ద కేసీఆర్‌కు ఉన్న కాస్తో కూస్తో గౌరవాన్ని కూడా కేటీఆర్ లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలను ప్రోత్సహించే విధంగా కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. వ్యవసాయ శాఖపై విమర్శలు చేయడం సరికాదని.. అభివృద్ధి చూసి కూడా రాజకీయ కుట్రలో భాగంగా విమర్శలు చేస్తే.. ఎంపీ ఫలితాలే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ రిపీట్ అవుతాయంటూ హెచ్చరించారు.

## 'చిలుకూరు' అర్చకునిపై దాడి కేసులో మరో ఐదుగురు అరెస్టు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రఖ్యాత చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం పేరుతో దాడి కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేసినట్టు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరంకు చెందిన రామరాజ్యం వ్యవస్థాపకులు, ప్రధాన నిందితుడు వీరరాఘవారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉదయం ఇద్దరు మహిళలతోపాటు మొత్తం ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. తమకు ఆర్థికంగా సాయం చేయాలని, రామరాజ్యంలో సభ్యుల్ని చేర్పించాలని రామరాజ్యం సభ్యులు.. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌ను డిమాండ్ చేశారు. దీనికి అర్చకులు నిరాకరించడంతో ఈ నెల 7వ తేదీన వీరరాఘవారెడ్డి అనుచరులు 25 మంది వాహనాల్లో చిలుకూరు వచ్చి రంగరాజన్‌పై దాడికి పాల్పడినట్టు తెలిపారు. నిందితుల్లో నిజామాబాద్, ఖమ్మంకు చెందిన వారు ఉన్నట్టు చెప్పారు.

**సీఎం పరామర్శ**

ప్రఖ్యాత చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ గారిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రంగరాజన్ పై కొందరు దుండగులు దాడికి పాల్పడిన ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటి దాడులను సహించేది లేదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.

## తెలంగాణలో బీర్ల ధరలు పెంపు..

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో మందు బాబులకు పెద్ద షాక్ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను సవరించింది. ప్రస్తుతం ఉన్న బీర్ల ధరపై 15 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జైస్వాల్ కమిటీ సూచన మేరకే ధరలు పెంచినట్లు పేర్కొంది.

## ముగిసిన నామినేషన్ల పర్వం



- కరీంనగర్ కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట
- చెదరగొట్టిన పోలీసులు
- కరీంనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 100 ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 17 నామినేషన్లు
- నల్లగొండలో 23 మంది అభ్యర్థులు. 50

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల స్థానానికి భారీగా నామినేషన్ లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి 100 మంది, టీచర్ల స్థానానికి 17 మంది నామినేషన్ వేశారు. 11న నామినేషన్లను పరిశీలిస్తారు. 12, 13 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.

కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల, టీచర్స్ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు చివరి రోజు భారీగా నామినేషన్ లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి 51 మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డితో పాటు మొత్తం 100 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఇక టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు 8 మంది నామినేషన్ వేశారు. ఆరు రోజుల్లో టీచర్స్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా మల్క కొమరయ్యతో పాటు 17 మంది నామినేషన్ వేశారు. చివరి రోజు కాంగ్రెస్ బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీ ర్యాలీలతో నామినేషన్ దాఖలు చేశారు.మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ టీచర్స్ అభ్యర్థి మల్క కొమురయ్య సైతం భారీ ర్యాలీతో నామినేషన్ వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉండగా ఆ పార్టీ నుంచి టికెట్ ఆశించిన కరీంనగర్‌కు చెందిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, ట్రస్మా ప్రతినిధి యాదగిరి శేఖర్ రావు పోటాపోటీ ర్యాలీలతో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.

**కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత**

కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లకు చివరి రోజైన సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ అభ్యర్థి సహా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు వాహనాలతో కలెక్టరేట్ లోపలి వరకూ వస్తుండగా పోలీసులు అడ్డు చెప్పారు. అయినప్పటికీ వాహనాలు లోపలి వరకూ వెళ్లాయి. అదే సమయంలో నామినేషన్ వేసి తిరిగి వస్తున్న స్వతంత్ర్య అభ్యర్థి.. బీఆర్ఎస్ నేత సర్దార్ రవీందర్ సింగ్ కలగజేసుకున్నారు. 'మా వాహనాలు అనుమతించకుండా.. మంత్రుల వాహనాలను ఎలా కలెక్టరేట్‌లోకి పంపించారు' అంటూ పోలీసులను ప్రశ్నించారు. దాంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ తోసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో తోపులాట

మిగితా 2వ పేజీలో

## కొడంగల్‌లో రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

- ఉప ఎన్నికలకు వెళ్దాం
- బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి 50,000 ఓట్ల మెజారిటీ తక్కువగా వచ్చినా రాజకీయ సన్యాసం తీసుకుంటా




**బలగం టీవి, హైదరాబాద్**

కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రేవంత్ రెడ్డిని ఉప ఎన్నికకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి 50,000 ఓట్ల మెజారిటీ తక్కువగా వచ్చినా, తాను రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ చెప్పారు. నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు నిరసన దీక్షలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లగచర్ల, రోటిబండతండా, హకీమ్‌పేట్, పోలేపల్లి, పులిచెర్లకుంటతండా రైతులను కేటీఆర్ కలిశారు. అంతకు ముందు కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట మండలం తున్కిమెట్ల వద్ద బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికాయి. రైతు దీక్షలో కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కారు తెలంగాణలోని 25శాతం రైతులకు రుణమాఫీ ఇంకా జరుగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.73వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.17,500 బాకీ ఉందన్నారు. ఈ మొత్తం త్వరలోనే చెల్లించేలా చూస్తామని పేర్కొన్నారు. కొడంగల్‌లో ఉప ఎన్నిక వస్తే బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం తథ్యమని దీమా వ్యక్తం చేశారు. కొడంగల్‌లో ఉప ఎన్నిక వస్తే రేవంత్‌ను ఓడిద్దామని ప్రజలు చూస్తున్నారన్నారు.తాను రైతు నిరసన దీక్షకు వస్తున్నట్లుగా లేదని.. కొడంగల్‌లో ఉప ఎన్నిక వచ్చి రేవంత్ రెడ్డి ఓడిపోయి పట్నం నరేందర్ రెడ్డి గెలిచాక చేసే విజయోత్సవ ర్యాలీకి వచ్చినా అన్నట్లుగా ఉందన్నారు. రేవంత్‌కు దమ్ముంటే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సర్కారు వందశాతం రుణమాఫీ ఏ గ్రామంలోనైనా జరిగిందని రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. అనుముల అన్నదమ్ముల కోసం, అదానీ కోసం, అల్లుడి కోసమే కొడంగల్ నియోజకవర్గంలో సంవత్సరం నుంచి కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా రేవంత్ అరాచకాలు చేస్తున్నాడని మండిపడ్డారు. తన మనుషుల కోసం కోట్ల విలువైన భూములను దోచిపెట్టేందుకే లగచర్ల రైతులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. అల్లుడికి కట్నం కింద ఇవ్వడానికే లగచర్ల భూములకు రేవంత్ సూటి పెట్టిండడని విమర్శించారు.

కౌరవరాజు దుర్యోధనుడిలా సంవత్సర కాలంగా అరాచకాలు చేస్తున్న రేవంత్ రెడ్డికి ఎదురొడ్డి కొడంగల్ ఆడబిడ్డలు అన్నదమ్ములు పోరాడుతున్నారన్నారు. సంవత్సర కాలంగా లగచర్ల, కొడంగల్‌లో కురుక్షేత్ర యుద్ధం నడుస్తుందని.. 14 నెలల పదవీకాలంలో రైతులు, మహిళలు, వృద్ధులు, యువత కోసం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క పని కూడా చేయలేదని మండిపడ్డారు. లగచర్ల భూములు తొండలు గుడ్లు పెట్టనవి అని రేవంత్ అబద్ధాలు చెప్పిండని.. ఎక్కడ చూసిన

మిగితా 2వ పేజీలో

## ఇంకెంత గడువు కావాలి

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు ఆలస్యమెందుకు..?
- 10 నెలలు పూర్తయింది.
- సుప్రీంకోర్టు
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ 18కి వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించగా, స్పీకర్ నుంచి సమాచారం కోసం మరింత సమయం కావాలని రోహత్గీ కోర్టును కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందిస్తామని కోర్టుకు చెప్పారు. ఇప్పటికే 10 నెలలు పూర్తయిందని, ఇంకెంత గడువు కావాలని ధర్మాసనం ప్రశ్నించింది. ముకుల్ రోహత్గీ విజ్ఞప్తితో పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 18 వాయిదా వేసింది.

## సీఎంను కలవాలనుకుంటున్నాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. మిమ్మల్ని కలవడానికి సమయాన్ని కేటాయించాలని ఆయన ఆ లేఖలో కోరారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని మంద కృష్ణ స్వాగతించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలు ఉన్నాయని మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఆ లోపాల వల్ల కొన్ని కులాల హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నివేదికపై చర్చించి సూచనలు చేసేందుకు తాము ముఖ్యమంత్రిని కలవాలని అనుకుంటున్నట్లు మంద కృష్ణ వెల్లడించారు. వీలైనంత త్వరగా తమకు సమయం కేటాయించాలని కోరారు.

# పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం




**బలగం టీవీ, హైదరాబాద్**

పాతబస్తీలోని దివాన్ దేవిడిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పది ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పివేయగా, రూ.50కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. స్థానికులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీలోని దివాన్ దేవిడిలోని అబ్బాస్, మదినా టవర్లో దాదాపు 400 వరకు రెడీమెడీ వస్త్ర వ్యాపారాలు నిర్వహించే హెూల్ సేల్ దుకాణాలు ఉన్నాయి. రోజు మాదిరిగానే వ్యాపారులు ఆదివారం రాత్రి వ్యాపారాలను ముగించుకొని షాపులను మూసివేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో 4వ అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలను ్న గమనించిన వాచ్‌మెన్ వెంటనే మొఘల్‌పుర అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు.

వస్త్రాలు కావడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందాయి. అగ్నికీలలు ఎగిసిపడడంతో మంటలు భారీగా అంటుకున్నాయి. మంటలు ఎక్కువ కావడంతో జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న ఆదేశాలతో హైకోర్ట్, యాకత్‌పుర, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, మలక్‌పేట, సాలర్ జంగ్ మ్యూజియం, రాజేంద్రనగర్ ఏరియాల నుంచి ఫైరింజన్లను రప్పించారు. దాదాపుగా 60 మంది అగ్నిమాపక సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. నాలుగో ఫ్లోర్లో చెలరేగిన మంటలు కొద్ది సేపట్లోనే సెల్లార్లోని 2 గ్రౌండ్ ఫ్లోర్ వరకు వ్యాపించాయి. అబ్బసి మదీనా టవర్‌లో చిన్న చిన్న గదులు ఉండడంతో మంటలు అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఈ సముదాయంలో 400 వరకు దుకాణాలు కొనసాగుతున్నాయని, ఎక్కడా ఫైర్ సేఫ్టీ లేదని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా, అగ్నిప్రమాదం సంభవించిన కాంప్లెక్స్‌లోని పై అంతస్తులో వాచ్‌మెన్ కుటుంబం ఉంటున్నారు.

ఈ విషయం తెలియడంతో అగ్నిమాపక సిబ్బంది వారిని కాపాడి పై అంతస్తు నుంచి కిందికి తీసుకుని వచ్చారు. విద్యుదాఘాతమే అగ్ని ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని చార్మినార్ ఎమ్మెల్యే మిర్ జుల్ఫికర్ అలీ, ఫైర్ డిజి జీవీ నారాయణ, అదనపు డీజీ ప్రసన్న కుమార్, డీసీపీ స్నేహా, ఏసీపీ చంద్రశేఖర్, రీజినల్ ఫైర్ అధికారి హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారులు ప్రభాకర్ రెడ్డి, షణ్ముఖ రావు, రఫీ సందర్శించారు.

# కొడంగల్‌లో రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పచ్చని పంటపొలాలు ఉన్నాయని తెలిపారు. లంబాడి ఆడబిడ్డలు గడప దాటి బయటకు రారని.. అలాంటి వాళ్లు ఢిల్లీకి వెళ్లి న్యాయం కోసం అడిగేంత దుర్మార్గంగా రేవంత్ వ్యవహరించాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎకరానికి రూ.70 లక్షలు విలువ చేసే భూములను రూ.10 లక్షలకే గుంజుకోవాలని చూశారని.. ఎదురు తిరిగిన రైతులపై అక్రమంగా కేసులు బనాయించారని మండిపడ్డారు.కొడంగల్ రైతుల కోసం పట్నం నరేందర్ రెడ్డి జైలుకు వెళ్లిండని.. అర్ధరాత్రి పోలీసులను ఊరు మీదికి పంపి లంబాడి ఆడబిడ్డలను రేవంత్ రెడ్డి అవమానించాడన్నారు. లగచర్ల జ్యోతి శివంగిలాగా ఢిల్లీలో లడాయి చేసిందని.. బంజారా ఆడబిడ్డల పోరాటంతోనే లగచర్ల రైతులకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని తెలంగాణ సమాజం ఎదురు చూస్తుందన్నారు. అడ్డి మారి గుడ్డి దెబ్బలాగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండని.. రేవంత్‌ది రేషం లేని బతుకని.. లంకెబిందెలు ఉన్నాయి అనుకొని అడ్డమైన హామీలు ఇచ్చానని చెప్పుకుంటున్నాడని విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ఎకరానికి రూ.15 వేల సాయం చేస్తామని హామీ ఇచ్చి రూ.12 వేలు ఇస్తామంటున్నందుకు రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు పెట్టాలన్నారు.

రుణమాఫీపై తాను గతంలోనే చాలెంజ్ చేశానని.. ఇప్పుడు కొడంగల్ గడ్డపై నుంచి సవాల్ చేస్తున్నానన్నారు. కల్వకుర్తి పక్కనే వెల్దండలో ఉన్న రేవంత్ సొంత భూముల్లో ఫార్మా కంపెనీలు పెట్టాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారానికి తోడు బీఆర్ఎస్ ఒక్కో ఎకరానికి రూ.5లక్షల చొప్పున పరిహారం కలిపి ఇస్తుందన్నారు. తెలంగాణ నీ తాత జాగీర్ కాదని.. కేసీఆర్ ఉన్నంత కాలం ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే వాళ్ల పక్షాన కొట్లాడుతామన్నారు. దామరగిద్ద తండా రైతుల కోసం కూడా పోరాడుతామని.. రూ.4,350 కోట్లతో కొడంగల్‌కు నీళ్ల తెస్తానని చెప్పుకుంటున్నాడని.. ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్లు.. కావాల్సిన మనుషులకు కమిషన్ ఇవ్వడానికి తప్ప కొడంగల్ ప్రజల కోసం ఏమాత్రం కాదన్నారు.

# అర్చకుడు రంగ రాజన్‌పై దాడి అమానుషం

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ జరిగిన దాడి అమానుషమని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఉన్న కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతస్థాయి పదవులను త్యజించి సనాతన ధర్మ పరిరక్షణకు అంకితభావంతో సేవలు అందిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఉన్నతమైన ధార్మిక విలువలను పాటిస్తున్న రంగరాజన్‌పై దాడి అత్యంత బాధాకరం, దురదృష్టకరమని పేర్కొన్నారు. గౌరవప్రదమైన అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై జరిగిన ఈ అమానుష దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దౌర్జన్య చర్యలకు, బెదిరింపులకు, భౌతిక దాడులకు ఏ మాత్రం స్థానం లేదని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, సనాతన ధర్మంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, యువతకు, విద్యార్థులకు ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేస్తున్న రంగరాజన్ దేవాలయాలను, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే విషయంలో, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడే అంశంలో ముందువరసలో ఉన్నారని కొనియాడారు. సంబంధిత అధికార యంత్రాంగం ఈ ఘటనకు బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి తరఫున రంగరాజన్‌కు అన్నిరకాలుగా అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు.

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటనను కేంద్రహెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించి, అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సోమవారం బండి సంజయ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# రంగరాజన్‌పై దాడి ఘటన చాలా దారుణం

**బలగం టీవీ, హైదరాబాద్**

చిలుకూరు ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటన చాలా దారుణమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ధర్మరక్షకులు దాడులు చేస్తారు.. రాజ్యాంగ రక్షకులు చూస్తూ కూర్చుంటారు. రంగరాజన్‌పై దాడిపై హిందూధర్మ పరిక్షకులు ఒక్క మాట మాట్లాడలేదు. దాడి ఘటన వీడియోలున్నా ప్రభుత్వం ఏం చేస్తోంది?. ముఖ్యమంత్రి, హెూంమంత్రి సమాధానం చెప్పాలి" అని కెటిఆర్ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారు ఏ ముసుగులో ఉన్నా, ఏ ఎజెండాతో ఇలాంటి దారుణానికి ఒడిగట్టినా, వారిని ఉక్కుపాదంతో అణచివేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. భగవంతుని సేవలో నిమగ్నమైన రంగరాజన్ కుటుంబ సభ్యులకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చిలుకూరు బాలాజీకి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఉన్నారని, స్వామి వారి సేవలో నిమగ్నమైన కుటుంబాన్ని అవమానించడం అంటే అది దేవుడినే అవమానించినట్టేనని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిందితులందరినీ వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసిన కేటీఆర్, రంగరాజన్ కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగరాజన్ కుటుంబ సభ్యులకు తాము పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# మృత దేహానికి రెండు రోజులు ట్రీట్మెంట్

- **రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం**
- **విచారణకు ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్**

మియాపూర్ సిద్ధార్థ హాస్పటల్ ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు మృతదేహానికి ట్రీట్ మెంట్ చేసిన ఘటనపై విచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు మంత్రి రాజన ర్సింహ ఆదేశాలో సోమవారం ఆరోగ్యశాఖ అధికారులు మియాపూర్ లోని సిద్ధార్థహా స్పిటల్లో లో తనిఖీలు చేశారు. అయితే సిద్దార్థ్ హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బంది మీడియాను లోపలికి అనుమతించలేదు.

కడప జిల్లాకు చెందిన సుహాసిని (26) కండ్లు తిరిగి పడిపోవడంతో నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని మియాపూర్ సిద్ధార్థ హాస్పిటల్కు తీసుకొచ్చారు. అయితే చికిత్స పేరుతో లక్షల రూపాయలు వసూలు చేశారని, ఇక డబ్బులు కట్టలేని పరిస్థితి రావడంతో నిమ్స్‌కు సుకెళ్లాలని చెప్పారని మహిళ కుటుంబ సభ్యులు చెప్పారు. ఈక్రమంలో సుహాసినిని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా సుహాసిని అప్పటికే మృతి చెందినట్లు డాక్ట ర్లు చెప్పారని తెలిపారు. దీంతో శనివారం సుహాసిని ఫ్యామిలీ మెంబర్స్ సిద్దార్థ్ న్యూరో హాస్పిటల్ ముందు ఆందోళన చేశారు. రెండు, మూడు రోజుల క్రితమే చనిపోయి నా తమకు సమాచారం ఇవ్వకుండా ట్రీట్. మెంట్ పేరుతో డ్రామాలాధారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కులగణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్ (డెడికేటెడ్ కమిషన్) తన 700 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. సోమవారం కమిషన్ చైర్మెన్ మాజీ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి నివేదిక అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుకబడిన వర్గాల (బీసీ) జనాభా లెక్కల సేకరణకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాల అమలులో భాగంగా ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఈ డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరించింది. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేటర్లు సేకరించిన డేటాను ఆన్‌లైన్ చేయడం పూర్తి కాగానే ఆ రిపోర్టును ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు అందజేసింది. ఈ సమాచారాన్నంతటినీ క్రోఢీకరించిన కమిషన్ తుది నివేదికను రూపొందించింది. ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం ఓ కొలిక్కి వచ్చి ఎన్నికల దిశగా ప్రభుత్వం ముందడుగు వేసేందుకు కీలకం కాబోతున్నది.

డెడికేటెడ్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ కమిషన్ నివేదికను బీసీ మంత్రిత్వశాఖకు పంపించింది. దీనిపై ఆ శాఖ నోట్ ఫైల్ తయారు చేసి సీఎంకి పంపించనుంది. ఒక రోజు గడువుతో ముఖ్యమంత్రికి నోట్ ఫైల్ చేరుతుందని భావిస్తుంది. అక్కడి నుంచి పంచాయతీ రాజ్ కు నివేదిక రాగానే రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గ్రామం యూనిట్‌గా వార్డులు, మండలం యూనిట్‌గా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీలు, రాష్ట్రం యూనిట్‌గా జెడ్పీ చైర్మెన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఈ మొత్తం ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి కానున్నది

# ముగిసిన నామినేషన్ల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు కలగజేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. సామాన్యులకు ఒక న్యాయం అధికార పార్టీ మంత్రులకు మరో న్యాయమా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన మంత్రులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

# 'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'

**బలగం టీవీ, హైదరాబాద్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఇందిరా పార్క్, ధర్నా చౌక్ వద్ద ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చింది ఏముంది.. చేసిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలు ఎవరు వచ్చినా ప్రతి రోజు సీఎం కలుస్తడు అంటడు అని.. 15 నెలలు అయినా ఎవరికీ కలువలేదన్నారు. కోడంగల్ వాళ్లను కూడా రానివ్వని పరిస్థితి నెలకొందన్నారు. మీ సత్తా చూపే సమయం వచ్చిందని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కలిసి ఉండాలని.. విడిపోయి ఉండొద్దన్నారు. అప్పుడే బలం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు కంకణం కట్టుకోవాలని..వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి, ప్రశ్నిస్తా నిలదీస్తానన్నారు. ఇప్పటికే అరెస్టు చేసిన వారి మీద వెంటనే విడు దల చేయాలని.. అక్రమ కేసులు ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏ జిల్లాలో ఎక్కడ ఇబ్బంది వచ్చినా మీకు బీఆర్ఎస్ జెండా అండగా ఉంటదన్నారు. ఓట్లప్పుడు ఎన్నో మాటలు చెప్పిండని.. అధికారంలోకి వచ్చాక మాట మార్చుతున్నాడని మండిపడ్డారు. అడిగితే ఉల్టా కేసులు పెట్టి జైల్లో వేస్తున్నడని.. పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నారు.

30 పర్సెంట్ గవర్నమెంట్ అని ఎమ్మెల్యేలు చెబుతున్నారని.. ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ కావాల్సిందేనన్నారు. పోలీసు వాళ్లకు జీతాలు రావడం లేదని.. ఆరోగ్య భద్రత పని చేస్తలేదని విమర్శించారు. పోలీసులు, ఆటో డ్రైవర్లు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పెడుతుందని.. ఉద్యోగస్తులకు డీఏలు పెండింగ్, రిటైర్మెంట్ అయిన వారికి బెన్ఫిట్స్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. మాటల గారడీ, అంకెల గారడీ అని అందరికి అర్థం అయ్యిందదన్నారు.

# రాజన్న జాతర

# ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలి

**-అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి వేడుకలు విజయవంతం చేయాలి**

**-భక్తుల నుంచి ఫిర్యాదు రాకుండా ఏర్పాట్లు చేయాలి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి జాతర వేడుకలు విజయ వంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం మహాశివరాత్రి జాతర సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈవో, ఆయా శాఖల ఉన్నతాధి కారులతో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహా శివరాత్రి జాతర వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించు కున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు . జాతర కు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఫోన్ సిగ్నల్స్ సమస్య దృష్టిలో ఆపరేటర్లతో చర్చించి తాత్కాలిక టవర్ల ఏర్పాటు చేయాలని అన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, వేములవాడ పట్టణానికి వచ్చే అన్ని ప్రధాన రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జాతర విధులు నిర్వహించడానికి వచ్చే సిబ్బందికి, ముఖ్య అతిథులకు వసతి సౌకర్యం కల్పించాలని అన్నారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని, ప్రతి పందిరి దగ్గర అవసరమైన భద్రత కల్పించాలని అన్నారు.

జాతర సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడిక క్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా మూడు షిఫ్ట్ లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిం చాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ళ వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

ప్రధాన ఆలయం, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్ ,జగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. మహా జాతర జరిగే సందర్భంగా మద్యం అమ్మకాలను వేములవాడ పరిసరాలలో నిషేధించాలని అన్నారు. మహాశివరాత్రి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని దానికోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎస్పీ అఖీల్ మహాజన్ మాట్లాడుతూ గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, త్రాగు నీటి సరఫరా ఉండాలని అన్నారు. తిప్పాపూర్ చౌరస్తా దగ్గర సాయంత్రం ఉండే మార్కెట్ జాతర సమయంలో ఉండకుండా ముందస్తు సమాచారం సంబంధిత వ్యాపారులకు అందజేయాలని ఎస్పి మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రి రెడ్డి, ఈ.ఓ వినోద్ రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సామాన్య భక్తులకు శీఘ్రంగా రాజన్న దర్శనం..

**● క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న రాజన్న ఆలయ ఈవో .కె.వినోద్**

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారికి ఇష్టమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ముందుగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన తర్వాత కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను సైతం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించుకొని సేవలో తరించారు. దీంతో సామాన్య భక్తులకు ధర్మదర్శనంలో లోటుపాట్లు ఇబ్బందులు లేకుండా ఈవో కె.వినోద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సామాన్య భక్తులకు శీఘ్రంగా దర్శనమయ్యే విధంగా కృషి చేస్తున్న ఈవో వినోద్ తీరుపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆలయ అధికారులకు,ఎస్పిఎఫ్ సిబ్బందికి ఈవో పలు సూచనలు చేశారు.



## బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ అర్బన్ మండలం కోడుముంజ గ్రామంలో శ్రీకృష్ణ కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వెములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కురుమ యాదవ సంఘం అధ్యక్షుడు, కొడుముంజ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిగుర్ల పర్శరాములు, ఉపాధ్యక్షుడు వట్టేల బక్కయ్య, కుల సంఘం పెద్ద మనుషులు గుంటి పర్షయ్య, సెక్రెటరీ రాజం ఎల్లయ్య, మాజీ సర్పంచ్ కదిరే రాజు ,కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఏర్రం రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కత్తి కనకయ్య, గుర్రం విద్యాసాగర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, శ్రీ కృష్ణ కురుమ యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలన ఐఫోన్ .. రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్

**● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**బలగం టీవీ , జగిత్యాల**



కేసీఆర్ పాలన ఐఫోన్‌లా ఉంటే రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉందని, ఐఫోన్‌కు, చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉంటదో కెసిఆర్‌కు, రేవంత్‌రెడ్డికి అంత తేడా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి బిసిల ఓట్లు వేయించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి బిసి కులగణనలో తప్పుడు లెక్కలు చూపించి బురిడీ కొట్టించారన్నారు. తప్పుడు జనాభా లెక్కలు చూపడంతో కాంగ్రెస్ పట్ల బిసి సమాజం అట్టుడికిపోతోందని అన్నారు. సిఎం వెంటనే బిసి కుల సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 2014లోనే రాష్ట్రంలో బిసిల జనాభా 52 శాతం ఉందని కెసిఆర్ చేపట్టిన సర్వేలో తేలిందని, లెక్కపెట్టడం కూడా చేతగాని రేవంత్‌రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చూపి బిసిలను మోసం చేయడం శోచనీయమన్నారు. ఈ తప్పుడు లెక్కలను రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో వినిపించి పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో బిల్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారనే లెక్కలను ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు. తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బిసి సంఘాలతో సమావేశం పెట్టారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీకి 31సార్లు వెళ్లేందుకు సమయం దొరుకుతుంది కానీ బిసి సంఘాలతో సమావేశమయ్యేందుకు సమయం దొరకడం లేదా అని ప్రశ్నించారు. కనీసం బిసి ఉద్యమాలు చేస్తున్న ముఖ్య నాయకులతో కూడా ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బిసిలను అవమానించడమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని అన్నారు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బిసిలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణిలో అల్లు అర్జున్ మామ వినతి

**బలగం టీవీ , హైదరాబాద్**



కాంగ్రెస్ పార్టీ నేత, ప్రముఖ నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సోమవారం గ్రీన్ లాండ్స్‌లోని మహాత్మ జ్యోతి రావు పూలే భవనంలో నిర్వహిస్తున ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు పలు జంక్షన్లను జీహెచ్ఎంసీ అభివృద్ధి చేస్తోంది. ఈ నేపథ్యంలో తన ఇంటి స్థలం సేకరణపై పునరాలోచన చేయాలని ప్రభుత్వాధికారులను చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా తన ప్లాట్‌లో ఓ వైపు 20 అడుగులు, మరో వైపు 36 అడుగుల భూమి సేకరించే అంశంపై వివరణ ఇవ్వాలంటూ అధికారులను ఆయన కోరారు. కేబీఆర్ పార్క్ చుట్టూ జంక్షన్ల అభివృద్ధి చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలో కీలక నిర్ణయం తీసుకొంది. అందుకోసం రూ. 1,100 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే.

## పోలీస్ కస్టడీకి మస్తాన్‌సాయి

**బలగం టీవీ , హైదరాబాద్**

అభ్యంతరకర వీడియోలతో యువతులపై బెదిరింపులకు పాల్పడు తున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్తాన్‌సాయిని పోలీసులు తమ కస్టడీకి తీసుకోనున్నారు. మస్తాన్‌సాయిని తమ కస్టడీకి ఇవ్వాలని నార్సింగి పోలీసులు రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు మస్తాన్‌సాయి రెండు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ప్రస్తుతం అతను జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. పోలీసులు ఈ నెల 13న మస్తాన్‌సాయిని తమ కస్టడీకి తీసుకోనున్నారు. మస్తాన్‌సాయిపై గతంలో నార్సింగి, మోకిల పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.రాజ్ తరుణ్, తాను విడిపోవడానికి మస్తాన్‌సాయి కారణమని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లావణ్య పేర్కొన్నారు.

## రంగరాజన్ పై జరిగిన దాడి ధర్మ పరిరక్షణపై జరిగిన దాడిగా భావించాలి

**● ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**

**బలగం టీవీ , అమరావతి**



చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ పై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. రంగరాజన్ పై ఒక మూక దాడి చేసిందనితెలి సితీవ్ర ఆవేదనకు గురయ్యానని వెల్లడించారు. రంగరాజన్ పై దాడి దురదృష్టక రమని అభిప్రాయపడ్డారు. ఇది ఒక వ్యక్తిపై కాదు... ధర్మ పరిరక్షణపై జరిగిన దాడిగా భావించాలని అన్నారు. "కొన్ని దశాబ్దాలుగా రంగరాజన్ ధర్మపరిరక్షణకు, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడేందుకు తపిస్తున్నారు... పోరాటం చేస్తున్నారు. రామరాజ్యం సభ్యులమని చెప్పి వెళ్లిన ఒక మూక రంగరాజన్ పై దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటనేది పోలీసులు నిగ్గు తేల్చాలి. ఆ మూకను నడిపిస్తున్నది ఎవరో గుర్తించి కఠినంగా శిక్షించాలి. ఈ దాడిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలి. సనాతన ధర్మ పరిరక్షణ కోసం రంగరాజన్ నాకు పలు విలువైన సూచనలు అందజేశారు. టెంపుల్ మూమెంట్ అనే కార్యక్రమం ఏ దశలో ప్రారంభించాల్సి వచ్చిందో తెలియజేశారు. హిందూ ఆలయాల నిర్వహణ, ధర్మ పరిరక్షణపై ఆయన ఎంతో తపన పడుతున్నారు. రంగరాజన్ పై జరిగిన దాడిని ప్రతి ఒక్కరం ఖండించాలి. చిలుకూరు వెళ్లి రంగరాజన్ ను పరామర్శించి, అండగా ఉంటామని ఆయనకు భరోసా ఇవ్వాలని జనసేన తెలంగాణ విభాగానికి దిశానిర్దేశం చేశాను" అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబో ఫిక్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమాపై పూర్తి క్లారిటీ వచ్చేసింది. ఆయన 157వ చిత్రంగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. దీన్ని సాహుగారపాటి నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని చిరంజీవి స్వయంగా తెలియజేశారు.

లైలా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడుతూ ఈ వేసవిలో అనిల్ రావిపూడితో సినిమా షుటింగ్ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ సినిమా పూర్తిగా హాస్యం ప్రధానంగా ఉంటుందని చిరంజీవి తెలిపారు. సినిమా చూసినంతసేపు కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలు ఉంటాయన్నారు. కథ చెప్పినప్పుడు నవ్వకుండా ఉండలేకపోయానన్నారు. తనకు కూడా ఎప్పుడెప్పుడు ఈ సినిమాలో నటించాలా అనే ఆసక్తి ఎక్కువగా ఉందన్నారు. దర్శకుడు కోదండ రామిరెడ్డితో



పని చేసినప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో? అనీల్ తో అలాంటి ఫీలింగ్ కలుగుతుందన్నారు.

# మురళీమోహన్‌కు ఎన్టీఆర్ పురస్కారం



**బలగం టీవీ, హైదరాబాద్**

సినీ నటుడు మురళీమోహన్‌ను ఎన్టీఆర్ పురస్కారం వరించింది. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను పురస్కరించుకుని మైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కల్చరల్ వింగ్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందమూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌కు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథం కలిగిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ పురస్కారం అందుకోవడానికి సినీనటుడు మురళీమోహన్ అన్ని విధాల అర్హుడని పేర్కొన్నారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఐక్యతో కోసం ఎంతో కృషిచేశారని.. ఆయన అడుగు జాడల్లో తాము నడుస్తున్నామని చెప్పారు.

మురళీమోహన్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తన అభిమాన ఆరాధ్య దైవమని అన్నారు. ఆయన కుమారుడు రామకృష్ణ చేతుల మీదుగా ఎన్టీఆర్ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సభకు ముందు సినీ జర్నలిస్టు ఏస్వి రామరావు రూపొందించిన విశ్వవిజేత ఎన్టీఆర్ జీవిత లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో జె.రాధాకృష్ణ, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 'బ్రహ్మా ఆనందం' ట్రైలర్ విడుదల చేసిన ప్రభాస్

**బలగం టీవీ, హైదరాబాద్**

పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మా ఆనందం' . స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఈ చిత్రం రాబోతోం ది. ఫిబ్రవరి 14న విడుదల కాబోతుంది. శ్రీమతి సావిత్రి,శ్రీ ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు ఆర్‌వీఎస్ నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. విజయవంతమైన నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను భారీ ఎత్తున నిర్మించారు. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేశారు.

ట్రైలర్‌ను గమనిస్తే.. 'బ్రహ్మా ఆనందం' ఓ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా అనే విషయం స్పష్టమవుతుంది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన ఓ యువకుడు థియేటర్ ఆర్టిస్ట్ కావాలనుకుంటాడు. దీని కోసం అతనికి కొంత డబ్బు అవసరం అవుతుంది. ఆ క్రమంలో అతనికి ఓ ముసలి వ్యక్తి పరిచయమై, తన 6




ఏకరాల పొలం ఇచ్చేస్తానంటాడు. అయితే 10 రోజుల పాటు తన స్వార్థం కోసమే ఆలోచించకుండా పక్కనున్న వారి కోసం కూడా ఆలోచించాలనే కండీషన్ పెడతాడు సదరు ముసలి వ్యక్తి.. ఆ తర్వాత ఏం జరిగిందనేదే 'బ్రహ్మా ఆనందం' సినిమా. వెన్నెల కిషోర్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకునే ఫన్నీ రోల్‌లో మెప్పించనుంటే, సంపత్ క్యారెక్టరైజేషన్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇక హీరో లైఫ్‌లో లవ్ ట్రాక్ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. అన్నీ వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా సినిమా ఉంటుందని ట్రైలర్ చూస్తుంటేనే అర్థమవుతుంది. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్ట్స్ రేంజ్‌కు తీసుకెళ్లారు మేకర్స్. బ్రహ్మా ఆనందం చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు.

## ప్రతిసారి ఎక్కువ పరుగులు సాధించడం ఈజీ కాదు : రోహిత్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల కాలంలో ఫామ్ లేమితో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ కటక్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన రెండో వన్డేలో విధ్వంసకర సెంచరీ(119) చేసి సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో మ్యాచ్ అనంతరం ఆయన మాట్లాడారు. 'ఇంగ్లాండ్‌పై నేను బాదిన సెంచరీ వల్ల ఏమీ మారదు. నా వర్క్‌లో ఇదొక రోజు అంతే. నేను చాలా కాలంగా క్రికెట్ ఆడుతున్నాను. ఎలా ఆడాలో నాకు స్పష్టత ఉంది. ఒకటి లేదా రెండు ఇన్నింగ్స్ నా మనసును మార్చవు. మైదానంలో నేను అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం ముఖ్యం. నేను మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. కొన్నిసార్లు అది సాధ్యమవుతుంది. మరికొన్ని సార్లు సాధ్యం కాదు. గ్రౌండ్ ఏమి చేయాలో నాకు స్పష్టత ఉంది. ఇంకేమీ పట్టించుకోను. అయితే ప్రతిసారి ఎక్కువ పరుగులు సాధించడం అంత ఈజీ కాదు' అని మ్యాచ్ అనంతరం రోహిత్ మాట్లాడాడు.




# 'కన్నప్ప' నుంచి 'శివ శివ శంకర'

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా సినిమా నుండి రిలీజ్ చేసిన 'శివ శివ శంకర' అనే సాంగ్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ తో పాటు స్టీఫెన్ దేవస్సీ సంగీతం, విజువల్స్ వీపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు, శరత్‌కుమార్, మధుబాల, ముఖేష్‌రిషి, బ్రహ్మానందం బ్రహ్మాజీ, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, కాజల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నీరజ్ మాదవ్, గౌరి కిషన్ కీలక పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం లవ్ అండర్ కన్‌స్ట్రక్షన్ . ఫిబ్రవరి 28న డైరెక్ట్ డిస్నీ ప్లస్ హాట్‌స్టాంలో మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్‌కు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.

# 'లైలా'ను చంపకండి

- **నటుడు విశ్వక్‌సేన్**

**బలగం టీవీ, హైదరాబాద్**



విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లైలా చిత్రం వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు పృథ్వీ చేసిన వ్యాఖ్యలు ఒక వర్గానికి కోపం తెప్పించడంతో సోషల్ మీడియాలో దీనికి సంబంధించి బాయ్‌కాట్ ట్రెండ్ నడుస్తోంది. అయితే ఈ వివాదంపై నటుడు విశ్వక్‌సేన్ క్షమాపణలు తెలిపాడు. విశ్వక్ మాట్లాడుతూ.. లైలా సినిమాను విడుదలయిన రోజే హెచ్‌డీ ప్రింట్ సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరిస్తున్నారు. 25000 ట్వీట్లు వేశారు బాయ్‌కాట్ లైలా అంటూ.. కామెంట్లు పెట్టారు. సినిమా వాళ్లు ఈజీగా టార్గెట్ అవుతామా అనిపిస్తుంది ఇవి చూస్తుంటే. పృథ్వీ చేసిన కామెంట్స్‌కు సినిమా యూనిట్‌కు సంబంధం లేదు. స్టేజ్ పై పృథ్వీ మాట్లాడేటప్పుడు నేను నిర్మాత లేము. మేమిద్దరం చిరంజీవిని రిసీవ్ చేసుకోవడానికి వెళ్లాము. పృథ్వీ మీద కోపం నా సినిమాపై చూపిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి. ఇలా చేసి సినిమాను చంపేయకండి. నాతో శత్రుత్వం లేనప్పుడు నా సినిమాను ఎందుకు టార్గెట్ చేస్తారు. నేను అన్నప్పుడు అలా చేయండి. ఈ వివాదం గురించి ఇంకా మాట్లాడాలి అనుకోవట్లేదు. మేము లేనప్పుడు జరిగిన తప్పుకి మమ్మల్ని బలి చేయకండంటూ విశ్వక్ చెప్పుకొచ్చాడు.

లైలా ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు పృథ్వీ మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను మేకల సత్యం పాత్ర పోషించానని... షాట్ గ్యాప్ లో తన వద్ద ఉన్న మేకలు లెక్కబెడితే 150 వరకు ఉన్నాయని... అయితే షాకింగ్ ఎంటో కానీ సినిమా చివరిలో లెక్కేస్తే మొత్తం 11 గొర్రెలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అదేంటో తనకు అర్థం కాలేదని వ్యాఖ్యానించారు. అయితే ఈ కామెంట్లు వైసీపీని ఉద్దేశించే చేశాడంటూ వైసీపీ అభిమానులు ఆరోపిస్తున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికలలో 151 సీట్లు గెలిచిన వైసీపీ గత ఎన్నికలలో 11 సీట్లకు మాత్రమే పరిమితం అయ్యింది. దీంతో పృథ్వీ వైసీపీ గురించే కామెంట్లు చేశాడని లైలా సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ట్రెండ్‌ని స్టార్ట్ చేశారు.